# అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలు పరిష్కరిస్తా



కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ప్రజా ఎవెన్యూ అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

- నా గెలుపునకు కృషిచేసిన పద్మశాలీలకు అండగా ఉంటా
- ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, డిసెంబర్ 15 : బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని ప్రజా ఎవెన్యూ ఫేజ్ త్రీ అపార్ట్‌మెంట్‌ను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డితో కలిసి సందర్శించారు. అపార్ట్‌మెంట్ వారి సమస్యలను అడిగి తెలుసుకుని సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, నాయకులు కెంచె మహేశ్, దిలీప్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

- తన విజయానికి దోహదపడిన పద్మశాలీలకు అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ఎమ్మెల్యేగా రెండోసారి భారీ మెజార్టీతో విజయం సాధించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌ను పద్మశాలీ సంఘం అధ్యక్షుడు వర్కాల కృష్ణ నేతృత్వంలో ప్రధాన కార్యదర్శి చిలక శివ్‌కుమార్, కోశాధికారి భీమనపల్లి అశోక్, గౌరవ అధ్యక్షుడు ఎనుగంటి నరేందర్, ఉపాధ్యక్షులు ఎ. అంజయ్య, కుందెన సత్యనారాయణ, గంగిశెట్టి సత్తయ్య, సంయుక్త కార్యదర్శులు గంధమల్ల శ్రీనివాస్, గంగిశెట్టి మల్లేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి తీగల నరేందర్, సభ్యులు ఆవుల రాములు, సలహాదారులు నక్క రమేశ్, గోల్నాక డివిజన్ అధ్యక్షుడు పెద్దబొమ్మ దామోదర్ తదితరులు ఎమ్మెల్యేకు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో తమకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన పద్మశాలీ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.



ఎమ్మెల్యే కాలేరుకు బొకే అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న పద్మశాలి సంఘం నాయకులు

# ఇండ్లు తొలగించకుండా చూడాలని వినతి



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న స్వామి వివేకానందనగర్ బస్తీ వాసులు

చిక్కడపల్లి, డిసెంబర్ 15 : గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానందనగర్ బస్తీ వాసుల ఇండ్లు కూల్చకుండా చూడాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు శుక్రవారం బస్తీవాసులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బస్తీ అధ్యక్షుడు ఎల్లమ్, ప్రధాన కార్యదర్శి ఎం.బి. కృష్ణ మాట్లాడారు. 70 సంవత్సరాలుగా బస్తీలో నివాసం ఉంటున్నామని, బసీలో ఉన్న 23 దళిత కుటుంబాలు కూలీ పనిచేసుకుంటూ బ్రతుకుతున్నామని తెలిపారు. ఇంటిపన్ను, కరెంట్ బిల్లు, వాటర్ బిల్లు కడుతున్నామని వివరించారు. కానీ 2022 సంవత్సరంలో నిర్మించిన శతాబ్ది అపార్ట్‌మెంట్, ఇతర కాలనీ ఏర్పాటు అనంతరం ఇండ్లు నిర్మించుకున్న యజమానులు తమపై కేసు వేశారని తెలిపారు. గత వారం రోజులు నుంచి జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు ఇండ్లు కూల్చివేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇండ్లు తొలగించాల్సి వస్తే పేదలమైన తమకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ప్రత్యామ్నాయం చూపించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే ముఠా గోపాల్ సానుకూలంగా స్పందించారని సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి బస్తీవాసులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని చెప్పారని తెలిపారు. పి. జాన్, కె. రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

- బీఆర్‌ఎస్ రాంనగర్ డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి శివకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కల్యాణ్‌నాయక్, దేవేందర్‌నాయక్, మున్నానాయక్, బాలునాయక్, చందు తదితరులు పాల్గొన్నారు.

## అమర జీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి

చిక్కడపల్లి,డిసెంబర్15 : కిన్నెర చిత్ర హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలి బుద్ధ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో జస్టిస్ ఎ.రామలింగేశ్వర రావు , ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, మాజీ ఎమ్మెల్సీ బొద్దులూరి రామారావు తదితరులు హాజరై పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పించారు.

## రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాచిగూడ,డిసెంబర్ 15: రైలు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ మల్లికార్జున్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి(40)శుక్రవారం విద్యానగర్–జామై ఉస్మానియా రైల్వేస్టేషన్‌ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని తెలిపాడు. మృతుని ఒంటిపై నీలి రంగు చొక్క, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 994937 2499లో సంప్రదించాలి.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

గోల్నాక, డిసెంబర్ 15 : అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. అంబర్‌పేట పోలీస్ ఇన్‌స్పెక్టర్ డి.అశోక్ తెలిపిన ప్రకారం.. లక్ష్మీపతిగౌడ్ (44).. తన భార్యతో కలిసి ప్రేమ్‌నగర్‌లో ఉంటున్నాడు. రెండు రోజుల క్రితం అతని భార్య పుటింటికి వెళ్లగా గురువారం అతను ఇంట్లోనే ఉన్నాడు. శుక్రవారం గ్యాస్ డెలివరీ బాయ్ తలుపుతట్టగా ఎంతకూ తీయకపోవడంతో ఇరుగు పొరుగు వారు కిటికీ తెరిచి చూడగా నిర్జీవంగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా మృతదేహంపై గాయాలు, రక్తపు మరకలు ఉన్నట్లు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసికోని దర్యాప్తు చేస్తున్నారు.

## ఓటర్ల రివిజన్‌పై రాజకీయ నాయకులతో సమావేశం




వివిధ పార్టీల నాయకులతో సమావేశమైన డీసీ మారుతీదివాకర్

అంబర్‌పేట, డిసెంబర్ 15 : రానున్న పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటర్ల స్పెషల్ సమ్మరి రివిజన్‌పై జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ కార్యాలయంలో రాజకీయ నాయకులతో డీసీ మారుతి దివాకర్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గంలో ఎవైనా లోటుపాట్లు జరిగాయా? పోలింగ్ బూత్‌ల మార్పు ఏమైనా ఉందా? అనే విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల పోలింగ్ బూత్‌లను మార్చాలని రాజకీయ పార్టీల నాయకులు డీసీ దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి జె.బాల్‌రాజు, అక్తర్, బీజేపీ నుంచి ఇ.అజయ్‌కుమార్, కాంగ్రెస్ నుంచి ఫరీద్, ఎంఐఎం నుంచి అఖిల్, జీహెచ్ఎంసీ అధికారులు శివ తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ శక్తి స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ, డిసెంబర్ 15: తెలంగాణ వ్యాప్తంగా 3,600 మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించడానికి స్త్రీ శక్తి స్వయం ఉపాధి కంప్యూటర్ శిక్షణకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు టీసేవ సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కాచిగూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మొబైల్ యాప్ ద్వారా కంప్యూటర్ అప్లికేషన్స్, ఆఫీస్ ఆటోమిషన్, డేటా ఎంట్రీ ఆపరేషన్, కంప్యూటర్ టైపింగ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ కోర్సులతో పాటు 50కి పైగా కోర్సుల్లో ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ నెల 26వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 8179955744, www.tseva centre.com లో సంప్రదించవచ్చని సూచించారు.

## బీసీ స్టడీ సర్కిల్ బడ్జెట్‌ను పెంచాలని వినతి



బీసీ స్టడీసర్కిల్ బడ్జెట్‌ను రూ.15 వేల కోట్లకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌యాదవ్ కోరారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్కను సచివాలయంలో కలిసి తెలంగాణ గురుకుల హాస్టళ్లు, బీసీ రుణాలకు 60 శాతం గ్రాంటు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. సత్యనారాయణ, లక్ష్మయ్య, సాయి, నగేశ్, రాహుల్ పాల్గొన్నారు. – కాచిగూడ, డిసెంబర్ 15

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి..



తెలంగాణలో పనిచేస్తున్న కల్లు గీత పరిశ్రమల ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తెలంగాణ రాష్ట్ర కల్లు గీత పరిశ్రమల ఉద్యోగుల యూనియన్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. అధ్యక్షుడు కె.హన్మాండ్లు గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు గోవర్ధన్‌గౌడ్, కోశాధికారి నర్సింహా గౌడ్, భిక్షపతిగౌడ్, కృష్ణగౌడ్ పాల్గొన్నారు. – కాచిగూడ, డిసెంబర్ 15

## దుప్పట్లు పంపిణీ..

చిక్కడపల్లి, డిసెంబర్15 : చలి తీవ్రత పెరగడంతో మాతా వాకర్స్ క్లబ్ నల్లకుంట, గాయత్రి వాకర్స్ క్లబ్ నల్లకుంట సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఆ క్లబ్ కార్యాలయం వద్ద దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్లబ్ గవర్నర్ చక్రపాణి, క్లబ్ అధ్యక్షుడు లింగా ప్రకాశ్, కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, సలహాదారుడు రామలింగేశ్వర రావు, కోశాధికారి మారం సుదేశ్, శరత్‌కుమార్, మోహన్‌కుమార్, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల పక్షాననే ఎర్రజెండా

చిక్కడపల్లి,డిసెంబర్15 : కార్మికుల పక్షాననే ఎర్రజెండా ఉంటుందని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.శుక్రవారం వీఎస్టీ క్రాస్ రోడ్స్‌లోని టీఎస్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన సాంబశివరావుకు సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సాంబశివరావును సన్మానించారు.

## బ్యాంక్‌ను మోసగించిన వ్యక్తిపై కేను నమోదు

కాచిగూడ, డిసెంబర్ 15 : బ్యాంక్‌లో బంగారు కోటింగ్ కడియాలు కుదువపెట్టి డబ్బులు కాజేసిన ఘటన కాచిగూడ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు, ఎస్సై సుభాష్ తెలిపిన ప్రకారం.. ఆసిఫ్‌నగర్‌కు చెందిన క్రాంతికుమార్(40)జూలైలో బర్కత్‌పురలోని ఇండియన్ బ్యాంక్‌లో 12 తులాల వెండి కడియాలకు బంగారు కోటింగ్ చేసి బ్యాంక్‌లో కుదువపెట్టి రూ.4,40,000లు లోన్‌గా తీసుకున్నాడు. అడిటింగ్‌లో భాగంగా శుక్రవారం బ్యాంక్ అధికారులు బంగారాన్ని పరిశీలించగా వెండి కడియాలకు బంగారు కోటింగ్ చేసినట్లు నిర్ధారించారు. దీంతో బ్యాంక్‌ను మోసగించినట్లు గుర్తించిన ఇండియన్ బ్యాంక్ మేనేజర్ అభినవ్‌మానస్ శుక్రవారం క్రాంతికుమార్‌పై కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్ తెలిపాడు.

## గుర్తుతెలియని వృద్ధురాలు మృతి

కాచిగూడ, డిసెంబర్ 15: గుర్తుతెలియని వృద్ధురాలు(70)కాచిగూడ రైల్వేస్టేషన్ మొదటి ద్వారం వద్ద శుక్రవారం మృతి చెందింది. కాచిగూడ హెడ్‌కానిస్టేబుల్ సమ్మయ్య ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. మృతురాలు అనారోగ్యంతో మృతిచెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. వృద్ధురాలి ఒంటిపై ఆకుపచ్చ రంగు చీర, నలుపు రంగు జాకెట్, ధరించి ఎత్తు 5.3 కలిగిఉన్నట్లు పేర్కొన్నారు. మృతిరాలి వివరాల కోసం 9948695948లో సంప్రదించాలని కోరారు. కేసును కాచిగూడ రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.